సాక్షి
కుమురం భీం
బుధవారం । 28 । జూన్ । 2023



అడవి తల్లికి 'తొలి' పూజ

ఉమ్మడి జిల్లాలోని గిరిజన గ్రామాల్లో అకాడి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. 8లో▸



కొండెక్కిన కూరగాయల ధరలు

జిల్లాలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మొన్నటి వరకు కిలో రూ.10లకు లభించిన టమాట తాజాగా రూ.100కు చేరింది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.6 /26.4

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: డిస్ట్రిక్ హబ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఉమెన్ శాఖలో ఒప్పంద ప్రాతిపదిక ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టు కోసం ఆర్థిక, బ్యాంకింగ్, తత్సమాన విభాగంలో డిగ్రీ, పీజీ అర్హత గల వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ, ఇతర సంస్థల్లో మూడేళ్లు పనిచేసిన అనుభవం, 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి జూలై 7 సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నిషేధిత మత్తు పదార్థాలపై దృష్టి సారించాలి



వీసీలో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: నిషేధిత మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఎస్పీలు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ ప్రజల భద్రత విషయంలో రాజీపడకుండా పోలీసు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శాంతి భద్రతల వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు సుధాకర్, పవన్‌కుమార్, రాణాప్రతాప్, బుద్ధస్వామి, శ్రీనివాస్, సాదిక్‌పాషా, ఆర్‌ఐలు భరత్‌భూషన్, శ్రీనివాస్, ఎస్సైలు దీకొండ రమేశ్, మధుకర్, సందీప్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: సివిల్ సర్వీస్ లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ తరగతులకు చెందిన డిగ్రీ పూర్తయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 7లోగా https://study circle.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 16న ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు సివిల్స్ మెయిన్స్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల జూలై 2 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్‌లో అర్హత పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు 10 నెలల ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

'దోపిడీ అరికట్టాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌లో కోత విధిస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది దోపిడీని అరికట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆసరా పెన్షన్లు అందిస్తూ.. రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి దోపిడీని అరికట్టాలని కోరారు.

'మొబైల్ ఆస్పత్రి'కి తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిన వాహనం

పెంచికల్‌పేట్(సిర్పూర్): మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్న మొబైల్ ఆస్పత్రి వాహనానికి ప్రమాదం తప్పింది. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్‌లో ప్రజలకు మూడురోజుల పాటే వైద్యసేవలను అందించిన అనంతరం మంగళవారం ఎల్కపల్లికి బయలుదేరింది. ఈ క్రమంలో బెజ్జూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారిస్తుండగా రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. మినీ ఆస్పత్రి వాహనం డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. క్రేన్ సాయంతో వాహనాన్ని బయటికి తీసేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సీఎం సభాస్థలి వద్ద వాటర్‌ప్రూఫ్ టెంట్ సామగ్రి



పటిష్ట భద్రత..

పకడ్బందీ ఏర్పాట్లు

- సీఎం కేసీఆర్ పర్యటనపై జిల్లా యంత్రాంగం దృష్టి
- భారీ జనసమీకరణకు బీఆర్‌ఎస్ సన్నాహాలు
- మండలాల వారీగా ముఖ్య నాయకులకు బాధ్యతలు
- వర్షం వచ్చినా సభ నిర్వహించాలని నిర్ణయం
- 50 వేల మందికి సరిపడే వాటర్ ప్రూఫ్ టెంట్ ఏర్పాటు

ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ నెల 30న జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, బీఆర్‌ఎస్ కార్యాలయంతోపాటు పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్న విషయం తెలిసిందే. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు రోజులుగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ హేమంత్ బోర్కడే జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారికంగా నిర్వహించే ప్రారంభోత్సవాలు, పోడు భూముల పట్టాల పంపిణీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలపై బిజీబిజీగా గడుపుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాయకులు..

ఆసిఫాబాద్‌లో సీఎం పర్యటనను ఉమ్మడి జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించి జన సమీకరణ, బహిరంగ సభ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు ముఖ్య నాయకులకు మండలాల వారీగా బాధ్యతలు అప్పగించారు.

మూడోసారి జిల్లాకు సీఎం..

అధికారంలోకి వచ్చిన తర్వాత మూడో సారి సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లాకు రానున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారి జోడేఘాట్‌కు వచ్చిన ఆయన కుమురంభీం వర్ధంతి సభకు హాజరయ్యారు. అనంతరం 2018లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. తాజాగా కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ ఇక్కడి నుంచే లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో సభ నిర్వహణ ప్రాముఖ్యతను సంతరించుకుంది. భారీ వర్షం కురిసినా సీఎం పర్యటన పక్కాగా నిర్వహిస్తామని మంత్రి ఐకే రెడ్డి స్పష్టం చేశారు. హెలీక్యాప్టర్‌లో జిల్లాకు రావడానికి వాతావరణం అనుకూలించకపోతే ముఖ్యమంత్రి రోడ్డు మార్గంలోనైనా వస్తారని ఆయన వెల్లడించారు.

బహిరంగ సభకు వాటర్‌ప్రూఫ్ టెంట్..


అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున్న నేపథ్యంలో సీఎం పర్యటనను అనుకూలంగా మార్చుకునేందుకు బీఆర్‌ఎస్ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. భారీ జనసమీకరణతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సీఎం సభ విజయవంతం చేసేందుకు నేతలు శ్రమిస్తున్నారు. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బహిరంగ సభాస్థలిలో ప్రజలు ఇబ్బంది పడకుండాకు 50 వేల మందికి సరిపడా ఉండే ప్రత్యేకమైన జర్మన్ ఆకృతి వాటర్ ప్రూఫ్ టెంట్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించారు. మంగళవారం బహిరంగ సభ స్థలంలో టెంట్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర రాజధాని నుంచి ప్రత్యేక బృందం కూడా వచ్చింది. స్థానిక ప్రేమల గార్డెన్ వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్, ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పటిష్ట బందోబస్తు కల్పిస్తాం



జిల్లా కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు 2500 మందితో పటిష్ట బందోబస్తు కల్పిస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 30న ముఖ్యమంత్రితోపాటు అధికారుల బందోబస్తుకు వచ్చే పోలీసు అధికారులు, సిబ్బందికి వసతి కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్స్, రోజ్‌గార్డెన్, జెడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీ పాఠశాల, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, పార్కింగ్ స్థలాలను మంగళవారం పరిశీలించారు. డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు రాణాప్రతాప్, సురేశ్, రమేశ్, నాగరాజు, సాదిక్‌పాషా ఉన్నారు.



విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్

ఆదివాసీ క్షేత్రంలో అద్భుత భవనాలు

సాక్షి ఆసిఫాబాద్: ఆదివాసీలకు నెలవైన కుమురంభీం జిల్లాలో అద్భుత రీతిలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు రూపుదిద్దుకున్నాయి. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ భవనాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయడంతో మంగళవారం రాత్రి ఇలా మెరుస్తూ కనిపించాయి.



ఎస్పీ కార్యాలయం

జోడేఘాట్ అభివృద్ధి బీఆర్‌ఎస్ ఘనతే

కెరమెరి(ఆసిఫాబాద్): రూ.25 కోట్లతో కుమురంభీం స్మారకార్థం, రెండు వరుస రహదారి నిర్మాణంతో పోరుగడ్డ జోడేఘాట్‌ను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. సిర్పూర్(యూ) మండల కేంద్రంలో స్థానిక నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసి.. వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కోవ లక్ష్మి, నాయకులు ఆత్రం భగవంత్‌రావు, ఆత్రం ప్రకాశ్, భూపతి, వీణాబాయి, జాలీంషా, ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కనక యాదవ్‌రావు

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

- ఆర్టీసీ డీఎం రామకృష్ణ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేయడం ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇలాంటి శిబిరం ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. తనతోపాటు 15 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది పండ్లు, జ్యూస్ అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, ఎస్‌టీయూ సరియా, ఏఎంఐ ఉదయ్, సిబ్బంది భారతి, ప్రభాకర్, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న వైద్యులు

దిగొచ్చిన వంటనూనె ధరలు

ఆసిఫాబాద్: కొన్ని నెలలుగా ఆకాశాన్నంటిన వంటనూనె ధరలు ఎట్టకేలకు దిగొచ్చాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం పేరుతో పలు కంపెనీలు నూనె రేట్లు అమాంతం పెంచిన విషయం తెలిసిందే. ఇతర దేశాల నుంచి దిగుమతి కూడా నిలిచిపోవడంతో మార్కెట్‌లో ధరలు సామాన్యులకు అందకుండా పోయాయి. నెల రోజులుగా తగ్గుతూ వస్తుండగా, సగటున లీటర్‌కు రూ.90 వరకు చేరుకున్నాయి. కోవిడ్ లాక్‌డౌన్‌కు ముందు వంట నూనెల ధరలు భారీగా పెరిగాయి. 2020లో పామాయిల్ లీటర్ రూ.180 ఉండగా, ప్రస్తుతం రూ.88కి తగ్గింది. తగ్గిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించింది. అయితే పప్పుదినుసులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు నిలకడగానే ఉన్నప్పటికీ నెల క్రితం కిలో రూ.120 ఉన్న కంది పప్పు రూ.155కు పెరిగింది. ఆరు నెలల క్రితం కిలో జిలకర్ర రూ.200 ఉండగా, తాజాగా రూ.700కి చేరింది. ఇటీవల కేంద్రం దిగుమతి సుంకం తగ్గించడంతోనే వంటనూనెల ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి.

వంటనూనె ధరలు (కిలోకు రూ.లలో)

రకం	గతేడాది	ప్రస్తుతం
పామాయిల్	180	88
సన్‌ఫ్లవర్	190	105
వేరుశనగ	180	160




గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ దివ్యరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు జూలై 8లోగా కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 10న స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. టీజీయూజీసెట్ రాసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. రూ.200 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వర్షం వస్తే దిగ్బంధమే!



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి గుండి గ్రామం కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయినా గ్రామస్తులు జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ 25 కిలోమీటర్లు తిరిగి రావాల్సిందే. 20 ఏళ్లుగా ఇక్కడి పెద్ద వాగుపై వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. భారీ వర్షాలు కురిస్తే సుమారుగా 10 గ్రామాల్లో 12వేల జనాభా బయటికి వచ్చే పరిస్థితి ఉండదు. గుండి వాగు, ఖమానా, తట్టుగూడెం వద్ద వాగులు ఉప్పొంగడంతో వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి.



కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండలానికి వెళ్లే మార్గంలో అందవెల్లి వద్ద పెద్ద వాగు వంతెన ఉంది. గతేడాది వరదలకు వంతెన కూలిపోయింది. శ్లాబులు కొట్టుకుపోవడంతో వర్షాకాలం అనంతరం తాత్కాలికంగా రవాణాకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు పిల్లర్ల పనులు కొనసాగుతున్నాయి. వర్షాలకు తాత్కాలిక మార్గం కొట్టుకుపోతే రాకపోకలు నిలిచిపోవాల్సిందే.

- అసంపూర్తిగా వంతెనలు.. అధ్వానంగా పల్లె రహదారులు
- వాగులు, వంకలు ఉప్పొంగి గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు



దిండా వాగులో గర్భిణిని నాటుపడవతో దాటిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

చింతలమానెపల్లి: వర్షాకాలం అంటేనే జిల్లా ప్రజలు భయపడే పరిస్థితి.. ఏళ్లు గడుస్తున్నా వంతెనల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించకపోవడం స్థానికులకు శాపంగా మారింది. ఏటా వాగులు, వంకలు ఉప్పొంగి రవాణా స్తంభించడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో 1,822 మేర కిలోమీటర్ల రహదారులు విస్తరించి ఉన్నాయి.

ముందస్తు చర్యలు కరువు..

జిల్లాలో ఏటా వరదలు వస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. అత్యవసర పరిస్థితులలో వైద్యం అందక గర్భిణులు, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యం, విద్యుత్, రవాణా వంటి అత్యవసర సేవలు అందించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలాల వారీగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి సమీప ప్రాంతాల్లో 108 అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలాల వారీగా పరిస్థితి..

- వర్షాకాలంలో ప్రధానంగా సమస్య ఎదుర్కొంటున్న మండలం దహెగాం. కాగజ్‌నగర్ నుంచి దహెగాం మార్గంలో అందవెల్లి వద్ద తాత్కాలిక వంతెన ఉండగా భారీ వర్షాలకు అది తెగిపోతే భీమిని, దహెగాం మండల ప్రజలు ఇబ్బంది పడాల్సిందే. లోహ గ్రామానికి వర్షాలు పడితే రవాణా కష్టమే. మొట్లగూడ, రాంపూర్, దిగిడ గ్రామాల ప్రజలకు కమ్మర్‌గాం వద్ద వంతెనతో కనీసం బెజ్జూర్ మండల కేంద్రానికి చేరుకునే అవకాశం ఉంది. దహెగాం మండల కేంద్రానికి రావాలంటే కర్జి వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ఇబ్బంది తప్పదు.
- బెజ్జూర్ మండలం ఎల్కపల్లి గ్రామం సమీపంలోనే ఉంటుంది. అయినా వర్షాకాలంలో మండల కేంద్రానికి చేరుకోవడం కష్టమే.. సోమిని, మొగవెల్లి, నాగెపల్లి, ఇప్పలగూడ, పాత సోమిని, తలాయి, తిక్కపెల్లి, భీమారం గ్రామాలకు భారీ వర్షాలు పడితే రాకపోకలు గగనమే.
- సిర్పూర్(టి) మండలంలోని ఇటికాలపహాడ్, చీలపల్లి గ్రామాలకు వర్షాలు భారీగా కురిస్తే ఇబ్బందులు తప్పవు.
- చింతలమానెపల్లి మండలం దిండా, శివపల్లి, రణవెల్లి, బూరెపల్లి, అంబగట్టు, పాతబూరెపల్లి, గ్రామాలకు భారీ వర్షాలు కురిస్తే వరదలు వస్తాయి. రహదారి ఉన్నా వంతెనలు లేక జల దిగ్బంధంలో ఉంటాయి. గంగాపూర్ గ్రామానికి రహదారి ఉన్నా ప్రాణహిత ప్రాజెక్టు కోసం తవ్విన కాలువ వద్ద ప్రమాదకరంగా ఉంది. దిండా గ్రామానికి వాగుపై లోలెవల్ వంతెన నెలల తరబడి నీటిలో మునిగిపోతుంది. గ్రామస్తులు వాగు నీటిలో దీక్ష చేసి కలెక్టరేట్‌కు పాదయాత్ర నిర్వహించినా వంతెన మాత్రం మంజూరు కాలేదు.
- కౌటాల మండలంలోని పాత కన్నెపల్లి, పార్డి, సాండ్‌గాం, వీరవెల్లి, కౌఠి గ్రామాలకు వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మించారు.
- పెంచికల్‌పేట్ మండలం గుండెపల్లి, కమర్‌గాం, మొర్లిగూడ, జిల్లెడ, నందిగాం గ్రామాలకు వానాకాలం రహదారి కష్టాలు తప్పవు.
- కాగజ్‌నగర్ మండలం మానిక్‌పటార్ గ్రామానికి రహదారి లేదు. అందవెల్లి వంతెన తాత్కాలికంగా నిర్మాణం కొట్టుకుపోతే బోడెపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాలకు రవాణా నిలిచిపోతుంది.
- కెరమెరి మండలం అనార్‌పల్లికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణంలో ఉంది. పలు గ్రామాలకు లోలెవల్ వంతెనల స్థానంలో హై లెవలు వంతెనలు నిర్మించాల్సి ఉంది.
- తిర్యాణి మండలంలో మంగీ నుంచి తాటిగూడ మార్గంలో బురద కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఎర్రబండ, కొటగాం, గీసిగూడ, అర్జున్ లొద్ది గ్రామాలకు ఇదే దుస్థితి.

గతంలో జరిగిన ఘటనలు

- వరదలు వచ్చినపుడు దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన గర్భిణిని తరలించే సమయంలో సింగరేణి రెస్క్యూ టీం సభ్యులు ఇద్దరు వరద కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు.
- బెజ్జూర్ మండలం నాగెపల్లికి చెందిన గర్భిణికి పురిటినొప్పులు రాగా.. మండల కేంద్రానికి మార్గం లేక చింతలమానెపల్లి మీదుగా తరలిస్తుండగా కోయపల్లి వద్ద రహదారిపై ప్రసవం జరిగింది.
- చింతలమానెపల్లి మండలం దిండా గ్రామానికి చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులునాటు పడవలో వైద్యం కోసం తరలించారు.
- గతేడాది పెంచికల్‌పేట్ మండలం నందిగామ గ్రామానికి చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ట్రాక్టర్ ద్వారా బెజ్జూర్ మండల కేంద్రానికి తరలించారు.

క్లుప్తంగా

‘మైసమ్మ’పై నిషేధం లేదు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల వద్ద కార్మికులు ఆనవాయితీగా చేసుకునే మైసమ్మపై ఎలాంటి నిషేధంలేదని ఏరియా జీఎం సంజీవ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఉద్యోగులు, అధికారులు మద్యం సేవించడం, జూదం ఆడడం, కొట్లాటకు దిగడం వంటివి చేస్తున్నారని తమదృష్టికి వచ్చిందని, మైన్స్‌రూల్స్ 1955 ప్రకారం ఇవి నిషేధమన్నారు. ఈ చట్టాలన్ని అమలు చేస్తూ తాము ఆదేశాలు జారీ చేశామన్నారు. కానీ దీనిని కొందరు తప్పుగా అర్థం చేసుకుని మైస మ్మకు పూజలు నిషేధించినట్లు ప్రచారం చేస్తు న్నారని, ఇది సరికాదన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని సుంపు టంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిం ది. దస్నూరి రామన్నకు చెందిన ఎద్దు మంగళ వారం ఉదయం గ్రామ శివారులోకి మేతకోసం వెళ్లింది. మేత మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్‌వైర్ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదు కోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. ట్రాన్స్ కో అధికారులు శైలేష్, ఉదయ్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

డిగ్రీ పరీక్షకు ఒకే ఒక్కరు..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం ఒకే ఒక విద్యా ర్థిని పరీక్ష రాసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. బీకాం కంప్యూటర్ చదువుతున్న కె.తిరుపతమ్మ మాత్రమే పరీక్షకు హాజరుకాగా చీఫ్ సూపరిం టెండెంట్, అబ్జర్వర్, ఇన్విజలేటర్, కానిస్టేబ ల్, క్లర్క్, ఆయా మరో ఇద్దరు ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వచ్చింది.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

కౌటాల: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తాటినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం ప్రమోద్(24)కు సిర్పూర్(టి) మండలంలోని పారిగాంకు చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకోవడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోవడం తో మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెం దాడు. మృతుని సోదరుడు సంగీత్‌రావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉడుమును చంపిన ఒకరి రిమాండ్

జన్నారం(ఖానాపూర్): షెడ్యూల్ 1 వన్యప్రాణి ఉడుము (బెంగాల్ మానిటర్)ను హతమా ర్చిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చింతగూడ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు. చింతగూడ గ్రామానికి చెందిన పానగంటి శ్రీను కవ్వాల్ టైగర్‌జోన్ లోని అటవీప్రాంతంలో ఈ నెల 24న ఉడుము ను చంపినట్లు వచ్చిన సమాచారం మేరకు అత నిపై కేసు నమోదు చేశారు. మంగళవారం అరె స్టు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది.



పొచ్చెర జలపాతం



కనకాయి జలపాతం




కుంటాల జలపాతం

కడెం తీరం.. సోయగాల హారం

ప్రకృతికి నిలయంగా.. నదీ పరీవాహకం

- గోదావరికి ఉపనదిగా...
- సాగుకు జీవనదిగా..
- జలపాతాలకు నిలయం
- ఆదిలాబాద్ జిల్లా దక్షిణ కాశ్మీరంలో కడెం నది ఓ భాగం

కడెం నది
ప్రారంభం : ఉమార్దా(బి), ఆదిలాబాద్ జిల్లా
ముగింపు : బెల్లాల్ (పెద్దూర్) నిర్మల్ జిల్లా
పొడవు : 86 కిలోమీటర్లు
నదిపై ప్రధాన సాగు నీటి ప్రాజెక్టు : కడెం ప్రాజెక్టు
జలపాతాలు : కుంటాల, పొచ్చర, కనకాయి, బంద్రేవ్, గాయత్రి



కడెం ప్రాజెక్ట్ అందాలు

బజార్‌హత్నూర్(బోథ్): ఆదిలాబాద్ జిల్లా అడవు లు, నదులు, జలపాతాలు, పచ్చదనం ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి. జిల్లాను దక్షిణ కాశ్మీర్‌గా పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు దక్షిణం వైపు గోదావరి నది, ఉత్తరం వైపు పెన్‌గంగా నది మధ్యలో కడెం నది పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో కడెం నది ప్రధానమైనది. కడెం నది కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ప్రవహించడంతో ఎక్కువ భాగం అడవుల గుండా ప్రవహిస్తూ, రాళ్లపై సవ్వడులు చేస్తూ జలపాతాలు దూకుతూ గోదావరి నదిలో కలుస్తోంది. నదీ తీరం సాగుకు జీవం పోస్తోంది.

కడెం నది ప్రయాణం ఇలా..

మండలంలోని ఉమార్దా వద్ద ప్రారంభమై గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో నదికి 17కిలోమీటర్ల వద్ద కనకాయి జలపాతం, బంద్రేవ్ జలపాతం, గొలుసుల గుం డం ఉన్నాయి. మరో 12 కిలోమీటర్ల ప్రయాణం తర్వాత నేరడిగొండ మండలంలో కుమారి వద్ద ప్రవేశిస్తుంది. కడెం నదికి ఉపనది అయిన బోథ్ మండలంలోని పెద్ద వాగుపై పొచ్చర జలపాతం ఉంది. కుమారి గ్రామ సమీపంలోనే కడెం నదిపై రాష్ట్ర ప్రభుత్వం 5.30 టీఎంసీల నీటి సామర్థ్యంతో మూడు మెఘావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.1100 కోట్ల నిధులతో కుప్టి ప్రాజెక్ట్ నిర్మా ణానికి ప్రతిపాదనలు చేసింది. అక్కడి నుంచి నది 10కిలో మీటర్లు ముందుకు వెళ్లాక కడెం నదికి ఉప నది అయిన ఇచ్చోడ మండలంలోని గుండివాగుపై గాయత్రి జలపాతం ఉంది. ఈ జలపాతం వద్ద జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్రీడా పోటీలు నిర్వహి స్తుంటారు. కడెం నది అక్కడి నుంచి మరో 11కిలో మీటర్లు ముందుకు వెళ్లిన తర్వాత నేరడిగొండ మండల పరిధిలో కవ్వాల్ అభయారణ్యం (టైగర్ జోన్)లో రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన, ప్రసిద్ధి చెం దిన కుంటాల జలపాతం ఉంది. ఈ జలపాతానికి జూలై నుంచి జనవరి వరకు రోజుకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. అక్కడి నుంచి 80 కిలో మీటర్లు ప్రయాణిస్తే కడెం మండల కేంద్రం సమీపంలో కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయ ణరెడ్డి ప్రాజెక్టు)ను నిర్మించారు.

ఉప నదుల సమాహారం..

కడెం నది ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో ఉంది. నది పరీవాహకం బజార్‌హత్నూర్, ఇచ్చో డ, బోథ్, నేరడిగొండ, సిరికొండ, కడెం, పెంబి మండలాల పరిధిలో ఉంది. కడెం నదికి చలివాగు, గాణాపురం వాగు, బతుకమ్మ వాగు, సిక్కుమాను వాగు, పలుకేరు వాగు, దట్కివాగు, రాగిదోబ, గుండివాగు, వాంకిడి వాగు, పెద్దవాగు, కమ్రపద్ద వాగులు ఉపనదులు ఉన్నాయి. ఈ వాగుల పరిధిలో చెరువులు, నీటికుంటలు అనేకం.

కడెం నది పరీవాహకం..

కడెం నది గోదావరి నదికి ఉపనది. ఇది కడెం రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ అభయారణ్యంలో ఉం ది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండ లం గిరిజాయి గ్రామపంచాయతీ పరిధిలోని ఉమర్దా గ్రామం వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రారంభవు తోంది. 86 కిలో మీటర్ల పొడవున ఆగ్నేయ దిశలో ప్రవహించి కడెం మండలం బెల్లాల్ గ్రామం వద్ద గోదావరి నదిలో కలుస్తుంది.



నది ప్రారంభమయ్యే స్థలం



కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం సాగునీటి ప్రాజెక్టు

కడెం ప్రాజెక్టు (కడెం ఆది నారాయణరెడ్డి ప్రాజె క్టు)ను 1958–1965 మధ్యకాలంలో నిర్మించారు. ఆయకట్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68వేల ఎకరాలు సాగవుతోంది. ఈ ప్రాజెక్టులో గోదావరి నదిపై గల శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా కడెం రిజర్వాయర్‌లో నీటిని నింపుతారు. నీటి పంపిణీకి రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడువు 76.8 కిలోమీటర్లు, కుడి కాలువ పొడువు 8కిలో మీటర్లు.



కడెం ప్రాజెక్ట్‌పై భాగంలో..

జలపాతాల నిలయం..

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనటువంటి ప్రకృతి రమణీయత కడెం నది పరీవాహక ప్రాంతం లో ఉంది. ఇక్కడ ఉన్న జలపాతాలు హైద రాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకు ల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బజార్‌హ త్నూర్ మండలంలోని కనకాయి, బంద్రేవ్ జలపాతాలు, బోథ్ మండలంలోని పొచ్చర, ఘన్‌పూర్ జలపాతాలు, ఇచ్చోడ మండలం లోని గాయత్రి జలపాతం, నేరడిగొండ మం డలంలోని కుంటాల, కొరిటికల్ జలపాతాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి.



గాయత్రి జలపాతంపై ట్రెక్కింగ్ చేస్తున్న క్రీడాకారుడు (ఫైల్)

సింగరేణి లాభాలు పంపిణీ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): సీఎం కేసీఆర్ హామీ మేరకు సింగరేణికి గతేడాది ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లోంచి రూ.700 కోట్లు ఉద్యోగులకు వెంటనే పంపిణీ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్య క్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళ వారం ఏరియాలోని కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడుతున్నం దు వల్ల అన్ని యూనియన్ ప్రతినిధులను సమానం గా చూడాలన్నారు. 190/240 మస్టర్లు నిండిన కార్మికులకు జనరల్ మజ్దూర్లుగా ఇవ్వాలని, కార్మిక కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని, తదితర సమస్య లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ అధ్యక్షుడు వెంకటస్వా మి, రాజేందర్, వెంకటేశ్, ఐలయ్య, సంజీవ్, భరత్, సంజీవ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటా కింద ఉన్న సీట్లను సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యో గుల పిల్లలకు మంగళవారం కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. జీఎం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అలాట్‌మెంట్ లెటర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు ఈసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు లు సాధిస్తున్నారన్నారు. పక్కాభవనం, అన్ని వసతు లతో కూడిన హాస్టల్, అధునాతన లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడాప్రాంగణం ఉన్నాయన్నారు. విద్యార్థులు కష్ట పడి చదివి భావిభారత ఇంజినీర్లు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ఇన్ చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అధికారి ఎం.దేవేంద ర్, అడ్మిషన్ ఇన్‌చార్జి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి అలాట్‌మెంట్ లెటర్ అందిస్తున్న జీఎం

వివాహం కావడంలేదని ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి
- యువకుడి నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

జైపూర్(చెన్నూర్): వివాహం కావడంలేదని మనస్తాపం చెంది యువ కుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మం డలంలో చోటు చేసుకుం ది. మండలంలోని నర్సిం గాపూర్ గ్రామానికి చెం దిన రౌతు మొండక్క–పా పయ్య దంపతుల కుమారుడు రౌతు సంతోష్ (27) సింగాపూర్ ఓపెన్‌కాస్టులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం కావడంలేదని మనస్తాపానికి గుర య్యాడు. ఆదివారం మధ్యాహ్నం నర్సింగాపూర్ సమీపంలోని కుందారం వైపు వెళ్లే దారిలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమ నించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ముందుగా మంచిర్యాలకు తరలిం చారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తర లించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.



సంతోష్ (ఫైల్)

సంతోష్ నేత్రాలతో ఇద్దరికి చూపు..

కాగా సంతోష్ నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసి మృతుని కుటుం బ సభ్యులు మానవత్వం చాటుకున్నారు. అతని మృతి చెందినా మరో ఇద్దరికి చూపునిచ్చాడని మృ తుని కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

అడవితల్లికి ‘తొలి’ పూజ

- గిరిజన గూడేల్లో ప్రారంభమైన ‘అకాడి’ సంబురం
- ఊరూరా ఉత్సవాలకు శ్రీకారం
- అడవుల్లోనే వనభోజనాలు
- ఏత్మాసార్ పేన్‌కు పూజలు ప్రారంభం
- నాలుగు మాసాలపాటు కొనసాగింపు

కెరమెరి(ఆసిఫాబాద్):సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. ఆషాఢమాసంలో ముందుగా వచ్చే పండుగ అకాడి. నెలవంక కనిపించడంతో అకాడి వేడుకలు ప్రారంభించి వారం రోజులపాటు నిర్వహిస్తారు. మంగళవారం పెద్దసాకడ గ్రామంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో అకాడి పండుగ ప్రారంభించారు. పౌర్ణమి వరకు వేడుకలు నిర్వహించనున్నారు.

వనంలో పూజలు..

అకాడి వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్దసాకడ గ్రామ పొలిమేరలో ఉన్న బాబ్రిచెట్టు వద్దకు వెళ్లారు. చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణరేఖ లాంటి ఒక గీత గీశారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుర్రను ఊదడంతో పశువులు గీతపై నుంచి అడవిలోకి పరిగెత్తాయి. అడవిలోని చెట్లు, ఆకులకు అకాడిపేన్ పూజ చేశాక ఆ ఆకులను ఇళ్లకు తీసుకెళ్లారు.

కోడితో జాతకం..

ఆదివాసీల ఆచార వ్యవహారాల్లో భాగంగా గ్రామ పటేల్ ఇంటినుంచి తెచ్చిన కోడిని దేవుడి ముందు ఉంచుతారు. దాని ముందు గింజలు పోసి జాతకం చెప్పించుకుంటారు. అనంతరం ఇంటినుంచి తెచ్చిన కోడిని బలిస్తారు. అక్కడే ఒకచోట వంటలు తయారు చేశారు. అన్నం ముద్దలుగా చేసి ఒక్కొ క్కరూ ఒక్కో ముద్ద ఆరగించారు. అనంతరం మేకను బలిచ్చారు.



ఆకిపూన్ వద్ద భక్తులు



తుర్ర వాయిస్తున్న పెద్దలు



కోడి పంచాంగం చూస్తున్న ఆదివాసీలు

తుర్ర వాయింపు..

ఈ అకాడి పండుగల్లో మరో కొత్త కోణం ఉంది. అడ విలోకి వెళ్లిన పశువులు ఇళ్లకు చేరాలంటే తుర్ర వాయించాలని ఆచారం. పశువుల కాపరుల వద్ద ఈ తుర్ర ఉంటుంది. పశువులు ఎక్కడికి వెళ్లినా ఈ తుర్ర వాయిస్తే తిరిగి వస్తాయని వారి నమ్మకం. నెల రోజుల పాటు తుర్ర వాయిస్తూనే ఉంటారని పలువురు కటోడాలు చెబుతున్నారు.

ఏత్మాసార్ పేన్‌కు పూజలు!

అకాడి అనంతరం గ్రామంలోకి చేరుకున్న ఆదివాసీలు ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేశారు. నాలుగు మాసాలపాటు ఈ పూజలు కొనసాగను న్నాయి. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు పశువులు క్షేమంగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. అకాడి అనంతరం నాగుల పంచ మి, జాముురావూస్, శివబోడి, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు చేస్తారు.

అనాదిగా వస్తున్న ఆచారం



అకాడి పండుగ అనాది నుం చి వస్తున్న ఆచారం. ఈ పండగ చేశాకే అన్ని పండు గలు చేసుకుంటాం. ఈ సం దర్భంగా రాజుల్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహి స్తాం. ఇది ఆదివాసీల ఆచారం.

– కుర్సెంగ సోంజి, పెద్దసాకడ

ఆయురారోగ్యాలతో ఉండాలని..



ప్రజలతో పాటు, పశుపక్షాదు లు ఆయురారోగ్యాలతో ఉం డాలని రాజుల్ దేవతను కొలిచే పండుగ ఇది. ఇందులో భాగంగానే కోడి పంచాంగం చెబుతుంది. దాని ప్రకారమే సంవత్సర కాలమంతా నడవాల్సి ఉంటుంది.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

ఏత్మాసార్ పేన్‌కు పూజలు



అకాడి పూజల అనంతరం ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. గుస్సాడీ దీక్ష స్వీక రించే వారు ఈ రోజు మొక్కుకుంటారు. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.

– ఆత్రం బొజ్జిరావు, సార్‌మేడి, చౌపన్‌గూడ

సహకార బ్యాంకులో చోరీకి యత్నం

తిర్యాణి: మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో చోరీకియత్నించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం బ్యాంకు స్వీపర్ వసంత్ మంగళవారం తన ఉదయం బ్యాంకు తెరిచేందుకు రాగా అప్పటికే బ్యాంకు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే మేనేజర్‌కు సమాచారం అందించాడు. అతను వచ్చి బ్యాంకులోని లాకర్లు పరిశీలించగా నగదు భద్రపర్చిన లాకర్ ఓపెన్ కాకపోవడంతో నగదు అపహరించలేదని గుర్తించారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఇంట్లో చోరీ

మండల కేంద్రానికి చెందిన సకారం తన కూతురు కాలేజీలో దింపడానికి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హైదరాబాద్ వెళ్లాడు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఇంటికిరాగా తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్తుండగా ఇం టినుంచి వ్యక్తి పారిపోవడాన్ని గమనించి పోలీసు లకు అప్పగించాడు. ఇంట్లో బీరువాలోని రెండు తులాల బంగారంతో పాటు రూ.12 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. రెండు చోరీలకు పాల్పడింది ఒక్కడేనా? అనే విషయం తేలాల్సి ఉంది.